రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 45, బెండ 55, పచ్చిమిర్చి28, కాకర 55, బీర 55, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 33, దొండ 50, ఆలు 23, ఉల్లి 39, గోకర 45, దోస 23, సొర 13, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 55, అర్వి 45, మునగ 85, చిలగడదుంప 42, బీట్‌రూట్ 31, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 50. గురువారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా రోడ్డులోని హియర్‌వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజులపాటు ఉచిత వినికిడి పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్స్ నిర్వహిస్తామని ఆసుపత్రి నిర్వాహకురాలు డా. శ్రీలత తెలిపారు. రీ చార్జబుల్ చెవి మిషన్లు, బయటకు కనబడని చెవి మిషన్లు, బ్లూటూత్ చెవిమిషన్లు ఉచితంగా పరీక్షించుకొనేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. వివరాలకు 9985631926 సంప్రదించాలని ఆమె సూచించారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు.. పొంచి ఉన్న ముప్పు!



రాఘవేంద్ర కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్



బండ్లగూడ చౌరస్తాలో ఇదీ పరిస్థితి



బండ్లగూడ విజయ్ గార్డెన్‌లోని కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

- పట్టించుకొని విద్యుత్ శాఖ అధికారులు
- ఆందోళన వ్యక్తంచేస్తున్న ప్రజలు

నాగోలు: ట్రాన్స్‌కో అధికారుల ఉదాసీన వైఖరి, బాధ్యతా రాహిత్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతోంది... కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేసి.. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

◆ ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లకు కంచె లేదు. కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్ ఫార్మర్లకు కంచె ఉన్నా... ప్రస్తుతం అది తుప్పపట్టి ఊడిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు కోసమని ట్రాన్స్‌కో అధికారులు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసినా ఫలితం మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ ప్రధాన రోడ్లపైన, బస్తీల్లోని ట్రాన్స్ ఫార్మర్లకు ఏర్పాటు చేసిన కంచెలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయని, దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ ముఖ్యంగా నాగోలు, కొత్తపేట, ఎల్బీనగర్, మన్సూరాబాద్ తదితర డివిజన్ల పరిధిలోని పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేదు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఉన్నా ..శిథిలావస్థకు చేరింది. వాటికి వాహనాలు తాకడంతో నేల కూలాయి. అయినా, ట్రాన్స్‌కో అధికారులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.

◆ ప్రమాదం జరిగినప్పుడు తప్ప మిగతా సమయంలో ట్రాన్స్‌కో అధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని పలు కాలనీవాసులు కోరుతున్నారు.

సైదాబాద్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

- కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి



మ్యాన్‌హోల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: సమగ్రాభివృద్ధిని సాధించడం ద్వారా సైదాబాద్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి సైదాబాద్ ప్రధాన రహదారి, రెవెన్యూ బోర్డ్ కాలనీల్లో పర్యటించారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడటాన్ని గుర్తించిన ఆమె ఆయా చోట్ల ప్యాచ్ వర్క్ పనులు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. రెవెన్యూ బోర్డు కాలనీలో రహదారులపై మురుగు నీరు పారకుండా నిర్మిస్తున్న మ్యాన్‌హోల్ పనులను కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లో ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే తనకు సమాచారం ఇవ్వాలని, వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి



అక్బర్‌బాగ్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట: ప్రతి ఒక్కరూ సామాజిక సేవ దృక్పథం అలవర్చుకోవాలని సోషల్ వర్కర్ పూజల శ్రీనివాస్ అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లో ఫుట్‌పాత్‌పై ఉంటున్న వారికి, జీహెచ్ఎంసీ వర్కర్లకు మంగళవారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. చలి కాలంలో ఫుట్‌పాత్‌లపై నివాసిస్తున్న వారికి, నిరాశ్రయులకు చేయూత అందించేందుకు అందరూ ముందుకు రావాలని ఆయన కోరారు. ఆనంద్‌నగర్, పల్టాన్, దయానంద్‌నగర్, మలక్‌పేట ప్రధాన రహదారులలో దుప్పట్లు పంపిణీ చేశారు.

జనవరి 22ను సెలవురోజుగా ప్రకటించాలి

సుల్తాన్‌బజార్: అయోధ్య రామ మందిరం ప్రారంభం, పునఃప్రాణ ప్రతిష్ఠ రోజైన 2024 జనవరి 22ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవురోజుగా ప్రకటించాలని అఖిలభారత హిందూ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు స్వామి కమలేష్ మహారాజ్ పేర్కొన్నారు. ఆయన అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్‌దాస్, కార్యదర్శి చంపత్‌రాయ్‌ను వేర్వేరుగా కలిసి ఏర్పాట్లపై చర్చించారు. ఉచితంగా రైళ్లు, బస్సులను నడపాలని అభ్యర్థించారు.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ 'టిమ్స్' నిర్మాణం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కొత్తపేటలో టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ కొత్తపేటలో నూతనంగా నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రి పనులను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణం గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 26 అంతస్తులతో నిర్మాణం జరుగుతుందని, భావితరాలను దృష్టిలో పెట్టుకుని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి ఆసుపత్రి స్థలం పరిసరాల్లో చిల్డ్రన్ పార్కు, విద్యుత్ సబ్ స్టేషన్, వాటర్ ట్యాంక్, అద్భుతమైన హాల్ నిర్మాణానికి స్థలాలను కేటాయించామని తెలిపారు. అలాగే ఆసుపత్రికి వచ్చేవారు సేద తీరేందుకు ఐదు అంతస్తులతో భవనాన్ని నిర్మించటం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రి భవనం రెండు అంతస్తుల నిర్మాణం పూర్తయ్యిందని, నెలకు ఒక స్లాబ్ చొప్పున నిర్మాణం జరుగుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలు, భద్రత చర్యలు పాటిస్తూ నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, అధికారులు సుభాష్, రాజు, ఆశాజ్యోతి, పద్మాకర్, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, గణేష్ తదితరుల పాల్గొన్నారు.

రాజ్యాంగంలోని రచనలను తెలుసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

దిల్‌సుఖ్‌నగర్: న్యాయ విద్యార్థులు న్యాయ శాస్త్రంలోని వివిధ సెక్షన్లను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ జడ్జి ఇందిర మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని రచనలు గురించి అందరూ తప్పకుండా తెలుసుకోవాలని సూచించారు. దేశంలో న్యాయవాదుల పాత్రను వివరించారు. రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమాజంలో అనేక వర్గాల వారికి ఉచిత న్యాయ సదుపాయలు కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి మాట్లాడుతూ, రెవెన్యూ పరిపాలనలో న్యాయవాదులకు గల అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సభ్యురాలు అమితారాణి, మహాత్మాగాంధీ న్యాయ కళాశాల కార్యదర్శి గంగుల గోవర్ధన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సత్యం, అధ్యాపకులు శ్రీలక్ష్మి, దేవి, మూర్తి పాల్గొన్నారు.

అధికారుల అండతోనే చెరువుల కబ్జా

- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
- మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి



హత్తిగూడ చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: చెరువులు, ప్రభుత్వ స్థలాలను రక్షించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కోరినా స్పందించడం లేదని, ప్రభుత్వ అధికారుల అండతోనే చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. డివిజన్ పరిధిలోని హయత్‌నగర్ సర్వే నంబర్ 98,99, 207ల్లో ఉన్న హత్తిగూడ చెరువును రక్షించాలని హయత్‌నగర్ మండల తహసీల్దార్ సునీతకు కార్పొరేటర్ బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, హత్తిగూడ చెరువు, చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతం కబ్జాకు గతంలో పలుమార్లు హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. హత్తిగూడ చెరువు సరిహద్దులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో చెరువు వద్ద నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. డివిజన్ పరిధి కొలను శివారెడ్డినగర్ సమీపంలోని సర్వే నంబర్ 207లోని ప్రభుత్వ స్థలాన్ని రీ సర్వే చేసి కాపాడాలన్నారు. 58,59 జీఓలతో ఇచ్చిన పట్టాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవే వైఆర్‌పీ ఫౌండేషన్ ధ్యేయం



పేద విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ ఎలిశాల రవిప్రసాద్

దిల్‌సుఖ్‌నగర్: పేద విద్యార్థులకు వైఆర్‌పీ ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటూ వారి విద్యకు సహాయ సహకారాలు అందిస్తోందని ఫౌండేషన్ చైర్మన్ ఎలిశాల రవి ప్రసాద్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాకు చెందిన నిరుపేద విద్యార్థులకు రూ.5 లక్షల స్కాలర్ షిప్ చెక్కులను బుధవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని వాసవి కాలనీలోని వైఆర్‌పీ ఫౌండేషన్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం నిరుపేద విద్యార్థుల కోసం వైఆర్‌పీ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి ప్రసాద్ మాట్లాడుతూ, నిస్వార్థ సేవే తమ ధ్యేయమన్నారు. సమాజం నుంచి తాము తీసుకున్న దాంట్లో ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ స్థాపించి 8 ఏళ్లుగా పేద విద్యార్థుల చదువుకు సాయం చేస్తున్నామన్నారు. పేద విద్యార్థులు తమ వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, నేరుగా ఆయా విద్యా సంస్థలకు ఆర్థిక సాయం డబ్బు పంపిస్తామన్నారు. ఇలా ఉండగా, సంస్థ చైర్మన్ ఎలిశాల రవి ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా బధిర విద్యార్థులకు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కొమ్మెర వెంకట్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి, శేషగిరి రావు, వాసు, టీఎన్ఆర్ నర్సింహారావు, శ్రీనివాస్, శరత్ చంద్ర, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సమితి బాలాపూర్ అధ్యక్షుడిగా రవీందర్

బడంగ్‌పేట్: తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన బాలాపూర్ గ్రామానికి చెందిన చింతపట్ల రవీందర్ సేవలను గుర్తిస్తూ సంక్షేమ సమితి బాలాపూర్ మండల అధ్యక్షుడిగా ఆయనను నియమించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని కొత్తపేటలో బుధవారం మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన వారికి తగిన ప్రాధాన్యత కల్పించారు. అందులో భాగంగానే బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ గ్రామానికి చింతపట్ల రవీందర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీఫెన్సన్ ఉత్వర్వులు జారీ చేశారు.

తాను మరణిస్తూ.. ఐదుగురి జీవితాల్లో వెలుగులు



అవయవదానం చేసిన సత్యనారాయణ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరో ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ రోజువారీ కూలీ. వివరాల్లోకి వెళితే... వరంగల్ జిల్లా తొర్రూర్ మండలం వెలకట్టె గ్రామానికి చెందిన రోజువారీ కూలీ కొమ్ము సత్యనారాయణ (40) ఈనెల 11న ఉదయం 8 గంటల ప్రాంతంలోని తన ఇంట్లో అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో చేర్పి చికిత్స అందించినప్పటికీ రోగిలో మార్పు రాలేదు. ఈ నెల 12న 11.38 గంటలకు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. సత్యనారాయణ భార్య భాగ్యలక్ష్మి, తండ్రి వెంకయ్యకు జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానంపై అవగాహన కల్పించగా, వారు అవయవదానానికి అంగీకరించారు. అవసరమైన రోగులకు అమర్చేందుకు సత్యనారాయణ రెండు కిడ్నీలు, లివర్, కంటి కార్నియాలను వైద్యులు సేకరించారు.

బంగారు తెలంగాణలో ఉద్యోగుల పాత్ర కీలకం

అబిడ్స్: బంగారు తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ ఉద్యమ ప్రధాన నాయకుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఉద్యోగుల కష్టంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ప్రొ. కోదండరాంను హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ..ఉద్యోగులు, నిరుద్యోగ సమస్యలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు.

ఆరు గ్యారంటీలతో ఎంతో మేలు

మలక్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజల ఆకాంక్షలు, ఆశలు తీరనున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల అమలుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాగా, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా నామినేట్ కాబోతున్న ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ను బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు చేకోలేకర్ శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



గడ్డం ప్రసాద్‌కుమార్‌తో ఎమ్మెల్యే రంగారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సలార్ ఈ మిల్లత్ ద్వారా కుట్టు మిషన్ శిక్షణ పొందిన 60 మంది మహిళలకు బుధవారం సలీంనగర్ సలీంఖాన్ కమ్యూనిటీ హాల్లో సర్టిఫికెట్స్, ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, తద్వారా కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. పేదల అభ్యున్నతి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం మహిళా విభాగం మలక్‌పేట ఇన్‌చార్జి నజీమా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులకు ఫిర్యాదు



సౌత్ఈస్ట్ జోన్ డీసీపీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్: కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని ప్రకటనలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ నాయకులు పోలీసులను కోరారు. ఈ మేరకు బుధవారం డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సౌత్ఈస్ట్ జోన్ డీసీపీని ఆయన కార్యాలయంలో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, జగదీశ్వర్‌రెడ్డిలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈవిధంగా ప్రకటనలు చేయడం వల్ల సామాన్య ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ఎలాంటి ఆధారాలతో వారు ఇలా వ్యాఖ్యానిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వంపై నిరాధార ప్రకటనలు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చౌకిరవికుమార్, ఆకుల రాజు పాల్గొన్నారు.

మద్యం షాపును తొలగించాలని వినతి



ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న జైపురి కాలనీ నాయకులు

నాగోలు: డివిజన్ పరిధిలో జైపురి కాలనీ ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర మద్యం షాపును మరో ప్రాంతానికి తరలించాలని జైపురి కాలనీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊరి పక్క రవి ఉప్పల్ ఎక్సైజ్ అధికారులను కోరారు. బుధవారం జైపురికాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉప్పల్ ఎక్సైజ్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జైపురి కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపు వల్ల తమ ఆడపిల్లలకు, చదువుకునే యువతకు, చిన్నపిల్లలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. శ్రీ వెంకటేశ్వర మద్యం షాపును తమ కాలనీ నుంచి తొలగించి వేరేచోట ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే చుట్టు పక్కల కాలనీవాసులు, మహిళలతో కలిసి సదరు షాపు వద్ద ధర్నా చేపడతామన్నారు. కాలనీ వాసులు వేముగంటి సంపత్, గుణగంటి రాములు గౌడ్, సెక్రటరీ వావిరాల వెంకట్ రెడ్డి. ఏముల నర్సింగ్ రావు. చింతల రాము. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీవీటీ మార్కెట్ లక్కీ డ్రా



మాట్లాడుతున్న ఖైరంకొండ ధనుంజయ

హుడాకాంప్లెక్స్: పీవీటీ మార్కెట్ 20వ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 9 నుంచి డిసెంబర్ 13 వరకు నిర్వహించిన లక్కీ స్కీమ్‌కు సంబంధించిన లక్కీ డ్రా గురువారం తీయనున్నట్లు మార్కెట్ మర్చంట్ కమిటీ అధ్యక్షుడు ఖైరంకొండ ధనుంజయ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు లక్కీ డ్రా ఉంటుందని తెలిపారు. లక్కీ స్కీం పరిధిలో దుస్తువులు కొనుగోలు చేసిన వినియోగదారులకు ధన్యవాదాలు తెలిపారు. పీవీటీ మార్కెట్ ఫౌండర్స్ కమిటీ చైర్మన్ చిలువేరు చంద్రయ్య, అధ్యక్షుడు భారత పురుషోత్తం, కమిటీ సభ్యులు, పీవీటీ మర్చంట్ కమిటీ సభ్యులు, వ్యాపారస్తులు, కొనుగోలుదారుల సమక్షంలో తీయనున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శ్రీధర్, భువనగిరి శ్రీనివాసులు, తడక కృష్ణ, చెరుకు భిక్షపతి, మానుపూరి ప్రసాద్ కుమార్, సురేశ్, పొట్ట రెడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

'నానీల సుగంధం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్.గోపి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాహితీ జిగిషాల ఆధ్వర్యంలో యువ రచయిత గిన్నారపు ఆదినారాయణ రచించిన 'నానీల సుగంధం' పుస్తకావిష్కరణ సభ బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్.గోపి మాట్లాడుతూ.. చెప్పాల్సిన విషయాన్ని తక్కువ పదాలతో బలంగా చెప్పడంలో నానీలను మించిన సాహితీ ప్రక్రియ మరొకటి లేదని తెలిపారు. యువ రచయిత ఆదినారాయణ భవిష్యత్‌లో మరిన్ని పుస్తకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓయు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య డి.వెంకటేశ్వరరావు, సాహితీ జిగిష కార్యదర్శి లలితవాణి, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకులు ఎం.దేవేంద్ర, నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.చంద్రయ్య పాల్గొన్నారు.

అయోధ్య రామ మందిరం అక్షింతలతో ప్రదర్శన



పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు ఉమామహేంద్ర

చార్మినార్: అయోధ్యలోని శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర నుంచి నగరానికి వచ్చిన రామ మందిరం అక్షింతలతో రామ భక్తులు, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలాభైరవ హనుమాన్ మందిరం నుంచి అక్షింతల కలశ పాత్రను తలపై పెట్టుకుని కబుతర్ ఖానా తదితర ప్రాంతాల్లో రామ భక్తులు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ భక్తులతో పాటు బీజేపీ టి.ఉమామహేంద్ర, నరేష్, సురేందర్, పంకజ్, ప్రవీన్ బాగ్డీ, కునాల్‌రావు తదితరులు మాట్లాడుతూ.. జనవరి 22న అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా నగరంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు.

పరాంకుశానికి తెలుగువర్సిటీ కీర్తి పురస్కారం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2021కి గాను కీర్తి పురస్కారాన్ని ప్రముఖ పాత్రికేయుడు పరాంకుశం వేణుగోపాల స్వామికి బుధవారం తెలుగువర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అందజేశారు. మూడున్నర దశాబ్దాలుగా పత్రికారంగంలో వివిధ స్థాయిల్లో విశేష అనుభవం కలిగిన పరాంకుశంకు తెలుగువర్సిటీ పత్రికా రంగానికి చేసిన సేవలను గుర్తించి రూ.50116 నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. రింగు రామ్మూర్తి, ఆచార్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలులోంచి పడి యువకుడి మృతి

కాచిగూడ: రైలు లోంచి పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... ఆర్ట్స్ కాలేజీ–జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ల మధ్య రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి(16) ఎలక్ట్రికల్ పోల్‌కు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.